PRGI Reg No. TGTEL/25/A0555
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

తెలంగాణ | సంపుటి : 01 | సంచిక :188 | పేజీలు : 8 | వెల రూ.5 | బుధవారం 29.07.2026

ఎడిటర్ : చెరుకు ఉపేందర్
Published From Rangareddy
Circulated by All Districts of Telangana and Andhra Pradesh




# హైడ్రా అధికారిగా ఎవరిని నియమించాలనే విచక్షణ ప్రభుత్వానికి ఉంది

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



న్యూఢిల్లీ, జులై 28 ప్రభాత సూర్యుడు హైడ్రా పనులు కొనసాగించి తీరుతామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. కబ్జా కోర్లు హైడ్రా వద్దంటున్నారని పేర్కొన్నారు. మంగళవారం ఢిల్లీలో పర్యటిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి విలేకర్లతో మాట్లాడారు. కబ్జాలు చేస్తే బడా బాబులైనా, పేదలైనా ఊరుకోమని స్పష్టం చేశారు. గండిపేట బతుకమ్మ కుంటలను ఆక్రమించింది పేదలా? పెద్దలా? అని విపక్షాలను ఆయన ప్రశ్నించారు. ఎన్ కన్వెన్షన్ పేదలదా? పెద్దలదా? అని వారిని నిలదీశారు. హైడ్రా తాము తీసుకొచ్చిన అతిపెద్ద సంస్కరణగా సీఎం అభివర్ణించారు. హైడ్రాకు ఉన్నతాధికారిగా ఎవరిని నియమించాలనే విచక్షణ తమ ప్రభుత్వానికి ఉందని కుండబద్దలు కొట్టారు. విశ్రాంత ఐఏఎస్ అధికారి సోమేశ్ కుమార్‌పైన 400 పైగా కోర్టు ధిక్కరణ కేసులున్నాయని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. దురుద్దేశంతోనే కేసులు వేసి కోర్టును తప్పుదోవ పట్టించారంటూ బీఆర్ఎస్ నేతలపై మండిపడ్డారు. కోర్టు తీర్పుని పరిశీలించి.. ఆ తర్వాత తదుపరి కార్యాచరణ రూపొందిస్తామని పేర్కొన్నారు. హైడ్రా కార్యాచరణ పైన తమకు పూర్తి స్పష్టత ఉందని అన్నారు. కబ్జాకోరులకు సహకరించొద్దంటూ మీడియాకు సూచించారు. డబ్బులు పెట్టి సోషల్ మీడియాలో హైడ్రాపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**ఆఫ్‌లైన్ పరీక్షల వల్లే ఎక్కువ సమస్యలు: సీఎం రేవంత్**

ఆఫ్‌లైన్ పరీక్షల నిర్వహణ వల్లే ఎక్కువ సమస్యలు వస్తున్నాయని అన్నారు. అందుకు బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. విద్యాశాఖలో రాష్ట్రాల అధికారాలను లాక్కునే యత్నం చేస్తుందంటూ కేంద్రంపై నిప్పులు చెరిగారు. వర్సిటీలపై ఆధిపత్యం చెలాయించాలని కేంద్రం చూస్తోందని విమర్శించారు. విద్య అంశం వీలైనంత వరకు రాష్ట్రాల పరిధిలోనే ఉండాలని అభిప్రాయపడ్డారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రక్షాళన చేసి నియామకాలు చేపట్టామని వివరించారు. తెలంగాణలో పారదర్శకంగా పరీక్షలు నిర్వహించామని చెప్పారు. గ్లోబరీనా వంటి సంస్థలు నాడు అక్రమాలు చేశాయని గుర్తు చేశారు. గత ప్రభుత్వం చర్యలు తీసుకోనందునే సీబీఎస్ఈకి ఈ అక్రమాలు విస్తరించారని సీఎం రేవంత్ పేర్కొన్నారు.

**రాష్ట్రానికి 11.56 లక్షల ఇళ్లు కేటాయించండి: కేంద్ర మంత్రికి సీఎం రేవంత్ విజ్ఞప్తి**

ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద తెలంగాణకు 11.56 లక్షల ఇళ్లు కేటాయించాలని కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా కేంద్రమంత్రితో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణకు సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించారు. గతంలో గ్రామీణ ఇళ్ల నిర్మాణాన్ని నిర్లక్ష్యం చేశారని తెలిపారు. అలాగే VB G RAM Gలో అదనపు పనులు కేటాయించాలని కోరారు. ఇక ఈ ఎదీ G RAM Gలో 10 కొత్త పనులను చేర్చాలని అడిగారు. కూరగాయల పందిళ్లు, పశు గ్రాస ప్లాట్లు, మల్బరీ తోటలు.. పట్టు పురుగుల పెంపకం షెడ్లకు కేంద్ర వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రిని సీఎం రేవంత్ అనుమతి కోరారు. ఇందిరమ్మ ఇళ్ల పనులను VB G RAM G జాబితాలో చేర్చి.. లబ్ధిదారులకు 90 రోజుల పని కల్పించాలని కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్‌కు సీఎం రేవంత్ విజ్ఞప్తి చేశారు.

**హైడ్రా కమిషనర్‌పై హైకోర్టు అసంతృప్తి**

లోతుకుంట భూముల కేసు విచారణ నేపథ్యంలో హైడ్రా కమిషనర్ ఎ.వి.రంగనాథ్‌పై తెలంగాణ హైకోర్టు సోమవారం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. హైడ్రా కమిషనర్ పదవి నుంచి రంగనాథ్‌ను తొలగించాని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఈ సందర్భంగా ఆదేశించింది. సెక్రటరీ ర్యాంక్ స్థానంలో ఉన్న ఉన్నతాధికారి.. కోర్టు ఉత్తర్వులను ధిక్కరించడం ఏ మాత్రం సమంజసం కాదని ఈ సందర్భంగా తెలంగాణ హైకోర్టు ధర్మాసనం వ్యాఖ్యానించింది. అర్హత కలిగిన అధికారిని హైడ్రా కమిషనర్‌గా నియమించాలని ఈ సందర్భంగా ప్రభుత్వానికి సూచించింది. హైడ్రా కమిషనర్‌గా రంగనాథ్ కొనసాగితే రూల్ ఆఫ్ లా తప్పుతుందని అభిప్రాయపడింది. ఆయన్ని తొలగించడం మినహా మరో ప్రత్యామ్నాయం లేదని తెలంగాణ హైకోర్టు పేర్కొంది. ఈ నేపథ్యంలో ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ పైవిధంగా స్పందించారు.

# హైడ్రాపై బీజేపీ, బీఆర్ఎస్ కుట్రలు చేస్తున్నాయి: మంత్రి శ్రీధర్ బాబు



హైదరాబాద్, జులై 28 ప్రభాత సూర్యుడు హైడ్రాపై బీజేపీ, బీఆర్ఎస్ కుట్రలు చేస్తున్నాయని, హైడ్రాపై ప్రజల్లో విశ్వాసం పెరుగుతోందని, రాజకీయ ప్రయోజనాల కోసమే వ్యతిరేక ప్రచారం జరుగుతోందని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. ప్రజల ప్రయోజనాల కోసం పనిచేస్తున్న సంస్థ హైడ్రా అని, అందుకే సాధారణ ప్రజలు దీనిని స్వాగతిస్తున్నారని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. హైడ్రాకు మద్దతుగా ప్రజలు స్వచ్ఛందంగా ర్యాలీలు నిర్వహించడం ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. ప్రభుత్వ చర్యలకు ప్రజల నుంచి వస్తున్న మద్దతును చూసి కొందరు రాజకీయ పార్టీలు అసహనం వ్యక్తం చేస్తున్నాయని విమర్శించారు. హైడ్రాను అడ్డుకునేందుకు రాజకీయ ప్రయోజనాల కోసమే కొందరు కోర్టుల్లో పిటిషన్లు దాఖలు చేస్తున్నారని ఆరోపించారు. బీజేపీ, బీఆర్ఎస్ కలిసి హైడ్రాపై కుట్రలు చేస్తున్నాయన్నారు. కోర్టు వ్యవస్థపై ప్రభుత్వానికి పూర్తి గౌరవం ఉందని మంత్రి శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. హైడ్రాకు సంబంధించిన పూర్తి తీర్పు ఇంకా వెలువడలేదని, తుది తీర్పు వచ్చిన తర్వాత ప్రభుత్వం చట్టపరంగా ముందుకు సాగుతుందని తెలిపారు. ప్రభుత్వం తరఫున చెప్పాల్సిన అన్ని అంశాలనూ కోర్టు ముందే వివరిస్తామని, న్యాయ ప్రక్రియను పూర్తిగా గౌరవిస్తామని చెప్పారు. అయితే కోర్టు తీర్పు పూర్తిగా రాకముందే కొన్ని రాజకీయ పార్టీలు, ముఖ్యంగా బీఆర్ఎస్ సోషల్ మీడియా వేదికల ద్వారా తప్పుడు ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. వాస్తవాలు బయటకు వచ్చే వరకూ ప్రజలు పుకార్లను నమ్మవద్దని, అధికారిక సమాచారం ఆధారంగానే స్పందించాలని మంత్రి శ్రీధర్ బాబు సూచించారు.

**విద్యార్థుల నిరసన కేంద్రానికి చెంపపెట్టు..**

నీట్ పరీక్ష అనేది కోట్లాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న అంశమని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. విద్యార్థుల నిరసనలను కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం వారి ఆకాంక్షలకు చెంపపెట్టులాంటిదని విమర్శించారు. ప్రధాని నివాసం ముందు రాహుల్ గాంధీ చేపట్టిన నిరసనతో ఈ ఉద్యమం మరింత ఉధృతమైందని చెప్పారు. కాంగ్రెస్ చేపట్టిన ఉద్యమాల వల్లే దేశవ్యాప్తంగా నిరసనలు విస్తరించాయని పేర్కొన్నారు. ఎన్ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్ నాయకుల్లో 90 శాతం మంది జెన్-జీ యువతేనని శ్రీధర్‌బాబు తెలిపారు. యువత ఆలోచనలకు అనుగుణంగా పనిచేసే నాయకత్వం సీఎం రేవంత్ రెడ్డిదని కొనియాడారు. జెన్-జీతో పోటీ పడే ఆలోచనా విధానం ఆయనకు ఉందన్నారు. రాష్ట్రంలో ఎవరు మంత్రులు కావాలన్నది కాంగ్రెస్ అధిష్ఠానం (ఏఐసీసీ) నిర్ణయిస్తుందని స్పష్టం చేశారు.

# జగిత్యాల జీజీహెచ్‌కు స్పెషాలిటీ హబ్ హోదా

## : మంత్రి దామోదర రాజనర్సింహ



హైదరాబాద్, ప్రభాత సూర్యుడు జగిత్యాల జీజీహెచ్‌కు స్పెషాలిటీ హబ్ హోదా కల్పించనున్నట్లు మంత్రి దామోదర రాజనర్సింహ కీలక ప్రకటన చేశారు. తెలంగాణ సచివాలయంలో జగిత్యాల జిల్లా వైద్య సేవలపై మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జగిత్యాల ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిని (జీజీహెచ్) అన్ని స్పెషాలిటీ వైద్య సేవలు అందించే కేంద్రంగా అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. అత్యాధునిక వసతులతో కొత్త ఆస్పత్రి భవన నిర్మాణాన్ని వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే జగిత్యాల మెడికల్ కాలేజీలో అన్ని పీజీ కోర్సులకు దరఖాస్తు చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కోరుట్ల, మెట్‌పల్లి ప్రభుత్వ ఆస్పత్రులకు త్వరలోనే స్పెషలిస్ట్ వైద్యులను నియమించనున్నట్లు వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా 1,616 స్పెషలిస్ట్ డాక్టర్ల పోస్టుల్లో ఇప్పటికే 1,182 నియామకాలు పూర్తయ్యాయని, గత రెండున్నరేళ్లలో ఆరోగ్యశాఖలో 15 వేల ఉద్యోగాలను భర్తీ చేసినట్లు మంత్రి తెలిపారు. జగిత్యాలలో త్వరలో క్రిటికల్ కేర్ బ్లాక్‌తో పాటు ట్రామా కేర్ సేవలను అందుబాటులోకి తీసుకురానున్నట్లు చెప్పారు. సెంట్రల్ మెడిసినల్ స్టోర్ ద్వారా జిల్లా ఆస్పత్రులకు నిరంతర ఔషధాల సరఫరా జరుగుతోందని, సిజేరియన్ డెలివరీలు తగ్గించి నార్మల్ డెలివరీలను ప్రోత్సహించేందుకు నర్సులకు మిడ్‌వైఫరీ శిక్షణ అందిస్తున్నామని పేర్కొన్నారు. జగిత్యాల జీజీహెచ్‌ను స్పెషాలిటీ హబ్‌గా, కరీంనగర్‌ను సూపర్ స్పెషాలిటీ హబ్‌గా అభివృద్ధి చేస్తూ, సబ్ సెంటర్ల నుంచి జిల్లా ఆస్పత్రుల వరకు ఉన్న సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

# టీవీ అవార్డులు.. పేరు, లోగో తెలంగాణ ఆత్మను ప్రతిబింబించాలి: మంత్రి కోమటిరెడ్డి



హైదరాబాద్: ప్రభాత సూర్యుడు టీవీ అవార్డుల కమిటీతో తెలంగాణ సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సమావేశమయ్యారు. అవార్డుల లోగో, పేర్లు, కేటగిరీలపై కమిటీ సభ్యులతో మంత్రి చర్చించారు. పేరు, లోగో తెలంగాణ ఆత్మను ప్రతిబింబించేలా ఉండాలన్నారు. కమిటీ సభ్యులు సూచించిన మాజీ ప్రధాని పీవీ నరసింహారావు పేరుపై సీఎం రేవంత్‌తో చర్చిస్తామని చెప్పారు. అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమానికి రెండు, మూడు వేదికలు సూచించాలని.. సీఎంతో చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామన్నారు. "అవార్డుల ఎంపిక పూర్తి పారదర్శకంగా ఉండాలి. టీవీ రంగం ఎక్కువ ఎంటర్‌టైన్‌మెంట్ ఇస్తోంది. ఈ రంగంలో రాణిస్తున్న అన్ని కేటగిరీల వారిని ప్రోత్సహిస్తాం" అని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు.

# థర్డ్ లాంగ్వేజ్‌లో జర్మన్, జపనీస్ భాషలు చేర్చాలి: మంత్రి వివేక్

**కేంద్రమంత్రి కిషన్‌రెడ్డితో మంత్రి వివేక్ వెంకటస్వామి, ఎంపీ వంశీకృష్ణ**



దిల్లీ, ప్రభాత సూర్యుడు: విదేశీ భాష నేర్చుకుంటే ఉద్యోగావకాశాలు ఎక్కువగా వస్తాయని, థర్డ్ లాంగ్వేజ్‌లో జర్మన్, జపనీస్ భాషలకు అవకాశమివ్వాలని కేంద్ర నైపుణ్యాభివృద్ధి శాఖ మంత్రి జయంత్ చౌధరిని రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి కోరారు. సోమవారం ఆయన ఎంపీ వంశీకృష్ణతో కలిసి పలువురు కేంద్రమంత్రులను కలిశామని ఒక ప్రకటనలో తెలిపారు. రామగుండంలో 100 పడకల ఆసుపత్రికి జీవో ఇవ్వాలని కేంద్రమంత్రి మన్‌సుఖ్ మాండవీయను కలిసి విన్నవించారు. అనంతరం కేంద్ర బొగ్గు, గనులశాఖ మంత్రి కిషన్‌రెడ్డి కలిశారు.



# డిజిటలైజేషన్ ప్రక్రియ వేగవంతం చేయాలి

**- బీఎల్ఓ--బీఎల్ఏల సమన్వయంతో పెండింగ్ ఓట్ల నమోదు పూర్తి చేయాలి**
**- తహసిల్దార్ సుదర్శన్ రెడ్డి**

అబ్దుల్లాపూర్‌మెట్ -- ప్రభాత సూర్యుడుస్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా ఓటర్ల వివరాల డిజిటలైజేషన్‌ను గడువులోగా పూర్తి చేయాలని అబ్దుల్లాపూర్‌మెట్ మండల తహసీల్దార్ బైరు సుదర్శన్ రెడ్డి సూచించారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన బీఎల్ఓ--బీఎల్ఏ సమావేశంలో ఆయన పాల్గొని, పెండింగ్‌లో ఉన్న ఓటర్ల వివరాల నమోదుపై సమీక్ష నిర్వహించారు. ఆగస్టు 3 డిజిటలైజేషన్‌కు చివరి తేదీ కావడంతో, గ్రామాల వారీగా పెండింగ్‌లో ఉన్న ఓటర్ల వివరాలను బీఎల్ఏలు, అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందజేశారు. బీఎల్ఏలు తమ పరిధిలోని బీఎల్ఓలతో సమన్వయం చేసుకుని పెండింగ్‌లో ఉన్న వివరాలను సేకరించి, డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ప్రజాస్వామ్యానికి పునాది అయిన ఓటరు జాబితా పారదర్శకంగా, లోపాల్లేకుండా రూపొందేందుకు అన్ని రాజకీయ పార్టీలు, బీఎల్ఏలు, బీఎల్ఓలు సమిష్టిగా పనిచేయాలని తహసీల్దార్ పిలుపునిచ్చారు. ఇప్పటివరకు అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని మొత్తం 33,410 ఓటర్లలో 25,384 మంది (76 శాతం) ఓటర్ల వివరాల డిజిటలైజేషన్ పూర్తైనట్లు అధికారులు వెల్లడించారు. మిగిలిన ప్రక్రియను గడువులోగా పూర్తి చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో బీఎల్ఓలు, బీఎల్ఏలు, బీఎల్ఓ సూపర్వైజర్లు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.



# గడువులోగా పెండింగ్ ఓటర్ల వివరాలు సమర్పించాలి

**- ఎస్ఐఆర్ పై రాజకీయ పార్టీలతో బడంగ్‌పేట్ డిప్యూటీ కమిషనర్ సమీక్ష**

బడంగ్‌పేట్ -- ప్రభాత సూర్యుడు ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్--2026) ప్రక్రియలో భాగంగా పెండింగ్‌లో ఉన్న ఓటర్ల వివరాలను ఆగస్టు 3లోగా తప్పనిసరిగా సంబంధిత బీఎల్ఓలకు అందజేయాలని బడంగ్‌పేట్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ వి. సమ్మయ్య రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు. మంగళవారం సాయంత్రం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఎస్ఐఆర్ కార్యక్రమం పురోగతి, క్షేత్రస్థాయి ఏర్పాట్లపై చర్చించారు. ప్రస్తుతం 1,62,312 మంది ఓటర్లలో 71,840 మంది (44.26 శాతం) ఓటర్ల వివరాల డిజిటలైజేషన్ పూర్తయ్యిందని తెలిపారు. ఇళ్లకు తాళాలు వేసి ఉండడం, ఓటర్లు అందుబాటులో లేకపోవడం వంటి కారణాలతో 90,472 ఎన్యుమరేషన్ ఫారాలు పెండింగ్‌లో ఉన్నాయని వెల్లడించారు. వాటి వివరాలను పెన్‌డ్రైవ్ రూపంలో రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందజేసినట్లు తెలిపారు. పెండింగ్ ఓటర్లకు సంబంధించిన సమాచారం లభిస్తే వెంటనే బీఎల్ఓలకు అందజేయాలని, గడువులోగా వివరాలు సమర్పించని ఓటర్ల పేర్లు ఆగస్టు 10న విడుదలయ్యే ముసాయిదా ఓటరు జాబితాలో ఉండకపోవచ్చని హెచ్చరించారు. పోలింగ్ స్టేషన్ల హేతుబద్ధీకరణపై అభ్యంతరాలు ఉంటే మహేశ్వరం ఎన్నికల నమోదు అధికారికి లిఖితపూర్వకంగా సమర్పించాలని సూచించారు.



# కుష్ఠు బాధితులకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందాలి

**- శాంతినగర్ కుష్ఠు కాలనీని సందర్శించిన డీఎంహెచ్ఓ డా. స్వర్ణ కుమారి**



అబ్దుల్లాపూర్‌మెట్ -- ప్రభాత సూర్యుడు:కుష్ఠు బాధితులు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని జీవనోపాధి, ఆరోగ్య పరిరక్షణలో ముందుకు సాగాలని జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారి డా. స్వర్ణ కుమారి సూచించారు. అబ్దుల్లాపూర్‌మెట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని పెద్ద అంబర్ పేట్ శాంతినగర్ లెప్రసీ కాలనీని అదనపు జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారి (ూణవీుూ)తో కలిసి ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా కుష్ఠు బాధితుల సంఘ సభ్యులతో సమావేశమై వారి ఆరోగ్య పరిస్థితులు, జీవన విధానం, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, అందుతున్న సేవలపై వివరాలు తెలుసుకున్నారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న కుష్ఠు బాధితుల గుర్తింపు, అవసరాల అంచనా, సంక్షేమ ప్రయోజనాల కల్పన కోసం చేపడుతున్న సర్వే పురోగతిని సమీక్షించారు. డా. స్వర్ణ కుమారి మాట్లాడుతూ.. కుష్ఠు వ్యాధి పూర్తిగా నయం చేయగల వ్యాధి అని, ప్రారంభ దశలో గుర్తించి చికిత్స పొందితే శాశ్వత వైకల్యాలను నివారించవచ్చని తెలిపారు. కుష్ఠు బాధితులకు ప్రభుత్వం అందిస్తున్న వైద్య సేవలు, పునరావాస సదుపాయాలు, వికలాంగుల పెన్షన్, గుర్తింపు కార్డులు, ఉపాధి అవకాశాలు తదితర సంక్షేమ పథకాలపై పూర్తి అవగాహన కల్పించి, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రయోజనాలు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో సర్వేను పారదర్శకంగా, నాణ్యతతో పూర్తి చేసి, ఏ ఒక్క అర్హుడూ ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దూరం కాకుండా చూడాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది, కుష్ఠు వ్యాధి నియంత్రణ కార్యక్రమం సిబ్బంది, కుష్ఠు బాధితుల సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

# హెపటైటిస్‌పై అవగాహనతోనే సంపూర్ణ నివారణ

**- ప్రపంచ హెపటైటిస్ దినోత్సవం సందర్భంగా డీఎంహెచ్ఓ డా. స్వర్ణ కుమారి పిలుపు**

మైలార్‌దేవ్‌పల్లి -- ప్రభాత సూర్యుడు:హెపటైటిస్ వ్యాధిపై ప్రజల్లో అవగాహన పెంపొందించడం ద్వారా వ్యాధి వ్యాప్తిని అరికట్టవచ్చని జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారి డా. స్వర్ణ కుమారి అన్నారు. ప్రపంచ హెపటైటిస్ దినోత్సవం సందర్భంగా మైలార్‌దేవ్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. హెపటైటిస్ కాలేయాన్ని ప్రభావితం చేసే తీవ్రమైన వ్యాధి అయినప్పటికీ, సకాలంలో పరీక్షలు, చికిత్సతో నియంత్రించవచ్చని తెలిపారు. హెపటైటిస్--బి వ్యాక్సిన్ తీసుకోవడం, పరిశుభ్రమైన ఆహారం, స్వచ్ఛమైన తాగునీరు వినియోగించడం, సురక్షిత రక్త మార్పిడి, సురక్షిత ఇంజెక్షన్ల వినియోగం వంటి జాగ్రత్తలు పాటించడం ద్వారా వ్యాధిని నివారించవచ్చని సూచించారు. ఈ మేరకు హెపటైటిస్ నివారణ, లక్షణాలు, చికిత్స, టీకాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించి, సమాచార కరపత్రాలను పంపిణీ చేశారు. హెపటైటిస్ లక్షణాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాలు ఉంటే సమీప ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో ఉచితంగా పరీక్షలు చేయించుకుని అవసరమైన వైద్య సేవలు పొందాలని కోరారు. హెపటైటిస్ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ అవగాహన కల్పించడంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ అధికారులు డా. రాకేష్, డా. జ్యోతిబాయి, డా. సమీనా, వైద్య అధికారి డా. రేఖ, వైద్యులు, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.




# మానసిక సమస్యతో బాధపడుతున్న మహిళ అదృశ్యం

నాగోల్ -- ప్రభాత సూర్యుడు నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలో మానసిక సమస్యతో బాధపడుతున్న ఓ మహిళ అదృశ్యమైన ఘటన చోటుచేసుకుంది. బండ్లగూడకు చెందిన కె. నారాయణ తన భార్య కె. లక్ష్మి (39) కనిపించడం లేదంటూ నాగోలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. కె. లక్ష్మి గత కొంతకాలంగా మానసిక సమస్యతో బాధపడుతోంది. ఈ నెల 27వ తేదీ మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు బంధువుల ఇళ్లతో పాటు పరిసర ప్రాంతాల్లో గాలించినప్పటికీ ఆమె ఆచూకీ లభించలేదు. దీంతో భర్త నాగోలు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. అదృశ్యమైన మహిళ ఎత్తు సుమారు 5 అడుగులు, గోధుమ వర్ణం, సన్నగా ఉండి, గుండ్రటి ముఖం, నల్లటి జుట్టు కలిగి ఉంటుంది. ఇంటి నుంచి వెళ్లే సమయంలో ఆకుపచ్చ రంగు చీర ధరించి ఉన్నట్లు పోలీసులు తెలిపారు. కె. లక్ష్మి ఆచూకీ తెలిసిన వారు సమీపంలోని నాగోలు పోలీస్ స్టేషన్‌ను లేదా 9676175912 నంబర్ కు సమాచారం ఇవ్వాలని నాగోల్ ఇన్‌స్పెక్టర్ మక్బూల్ జానీ విజ్ఞప్తి చేశారు.



# మల్కాజిగిరి పోలీస్ స్టేషన్ సీఐగా ఎస్. విజయ్‌కుమార్ బాధ్యతల స్వీకారం



**పోలీస్ కమిషనర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకున్న అధికారి**

ప్రభాత సూర్యుడు: హైదరాబాద్ । జూలై 28మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ పరిధిలోని లిలిమల్కాజిగిరి పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ (సీఐ) మరియు స్టేషన్ హౌస్ ఆఫీసర్ (ఎస్‌హెచ్ఓ)లిలిగా శ్రీ ఎస్. విజయ్‌కుమార్ ఈ నెల 27వ తేదీ సోమవారం అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, సహచర పోలీసులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు ఆయనకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తూ, నూతన బాధ్యతల్లో విజయవంతంగా రాణించాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం, విధి నిర్వహణలో చూపిన ప్రతిభ, క్రమశిక్షణ, అంకితభావాన్ని గుర్తించిన మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ గతంలో శ్రీ విజయ్‌కుమార్‌కు ప్రశంసా పత్రం అందజేసి సత్కరించారు. పోలీసు శాఖలో ఆయన సేవలు, ప్రజల పట్ల సానుకూల దృక్పథం, నిబద్ధతతో కూడిన విధి నిర్వహణకు ఈ గుర్తింపు లభించిందని వారు తెలిపారు. శ్రీ విజయ్‌కుమార్ తండ్రి శ్రీ నాగేశ్వరరావు ప్రస్తుతం ఎంజీఎన్‌ఆర్‌ఈజీఏ (ప్రస్తుతం జీ-రామ్/జి-రామ్ జీ) క్వాలిటీ మానిటరింగ్ విభాగంలో విధులు నిర్వహిస్తున్నారు. కుమారుడు కీలక బాధ్యతలు చేపట్టడం కుటుంబానికి గర్వకారణమని వారు ఆనందం వ్యక్తం చేశారు. నూతన బాధ్యతల్లో ప్రజలకు మరింత చేరువగా ఉంటూ, శాంతిభద్రతల పరిరక్షణ, నేర నియంత్రణ, ప్రజా సమస్యల పరిష్కారంలో సమర్థవంతమైన సేవలు అందించాలని పలువురు ఆకాంక్షించారు. మల్కాజిగిరి పోలీస్ స్టేషన్ సీఐగా బాధ్యతలు స్వీకరించిన శ్రీ ఎస్. విజయ్‌కుమార్‌కు ప్రజాపాలన కుటుంబం తరఫున హృదయపూర్వక అభినందనలు, శుభాకాంక్షలు

# ఒకేసారి ఐదు ఉద్యోగాలు సాధించిన యువకుడికి సన్మానం

**యువత అంజన్ కుమార్ ని ఆదర్శంగా తీసుకోవాలి**
**కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి**

ఇబ్రహీంపట్నం 28ప్రభాత సూర్యుడుఒకేసారి ఐదు ఉద్యోగాలు సాధించిన ఆరుట్ల గ్రామస్తుడు చిందం అంజన్ కుమార్ ని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు మంచాల మండలం ఆరుట్ల గ్రామానికి చెందిన చిందం సుగుణమ్మ కృష్ణయ్యల కుమారుడు అంజన్ కుమార్ ఒకేసారి ఐదు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించగా మంగళవారం వారం రోజున కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి ఆ యువకుడిని ఘనంగా సన్మానించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేద కుటుంబంలో జన్మించిన అంజన్ కుమార్ ప్రభుత్వ పాఠశాలలో చదువుకొని తెలంగాణ గ్రామీణ బ్యాంకు క్లర్క్, హైకోర్టు ఫీల్డ్ అసిస్టెంట్, రెండు రైల్వే ఎన్టీపీసీ ఉద్యోగాలు టీజీ ఎస్ ఆర్ టి సి సూపరిండెంట్ ఇలా ఒకేసారి ఐదు ప్రభుత్వ కొలువులు సాధించడం గర్వకారణం అని అన్నారు నేటి యువత అంజన్ కుమార్ ని ఆదర్శంగా తీసుకొని జీవితంలో ఎదగాలని అన్నారు. చెడు వ్యసనాల బారిన పడకుండా సన్మార్గంలో నడుస్తూ ఒక లక్ష్యాన్ని ఏర్పరచుకొని ఆదిశగా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గుడిమల్ల చంద్రయ్య, మార సురేష్, వస్పరి కుమార్, ఎండి అశ్రఫ్, కోరె పాండు, తదితరులు పాల్గొన్నారు.



# ఎమ్మెల్యే మల్ రెడ్డిని కలిసిన టీజీఎస్పీ 3వ బెటాలియన్ అధికారులు

**ఆగస్టు 3న ప్రారంభోత్సవాలకు మల్ రెడ్డి రంగారెడ్డికి ఆహ్వానం**
**అప్రోచ్ రోడ్డుతో పాటు స్పోర్ట్స్ మీట్ ప్రారంభోత్సవాలకు ఆహ్వానం**
**బెటాలియన్ సిబ్బంది హెచ్ఆర్ఏ ఫైల్ విషయంపై కలెక్టర్‌తో మాట్లాడిన ఎమ్మెల్యేమల్ రెడ్డి రంగారెడ్డి**

ఇబ్రహీంపట్నం 28 ప్రభాత సూర్యుడు తెలంగాణ స్పెషల్ పోలీస్ మూడో బెటాలియన్ అధికారులు, సిబ్బంది. ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి గారిని కలిశారు. బెటాలియన్ కమాండెంట్ సయ్యద్ జమీల్ బాష, అసిస్టెంట్ కమాండెంట్లు ఎం.వీరయ్య, ఆర్.పాండులు. వివిధ కార్యక్రమాల ప్రారంభోత్సవాల కోసం ఆగస్టు 3న బెటాలియన్ కు రావాలని వారు ఆహ్వానించారు. నాగన్ పల్లి రోడ్డు నుంచి బెటాలియన్ గేటు వరకు హెచ్ఎండీఏ నిధులతో ఎమ్మెల్యే ప్రత్యేక చొరవతో నిర్మించిన అప్రోచ్ రోడ్డు పూర్తికాగా. ఈ మేరకు వారు తొర్రూర్ లోని క్యాంపు కార్యాలయంలో మల్ రెడ్డి రంగారెడ్డి ని కలిసి తమ సంతోషం వ్యక్తం చేసి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఇందులో భాగంగానే 3వ తేదీన అప్రోచ్ రోడ్డు ప్రారంభోత్సవానికి రావాలని ఎమ్మెల్యేను కోరారు. అలాగే, అదే రోజు నుంచి ఇంటర్నల్ బెటాలియన్ స్పోర్ట్స్ మీట్ జరగనున్నందున ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా హెచ్ఆర్ఏ ఫైల్ అంశాన్ని వారు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. గత డిసెంబర్ లో గ్రేటర్ హైదరాబాద్ పరిధి విస్తరణ నేపథ్యంలో పెరిఫరీ 8 కిలోమీటర్లలోపు తమ బెటాలియన్ ఉన్నందున. కలెక్టర్ గారి వద్ద ఉన్న ఇంటి అద్దె పెంపు ఫైల్ ను త్వరగా నోటిఫై చేయించాల్సిందిగా కోరారు. వెంటనే స్పందించిన మల్ రెడ్డి. ఫోన్లో కలెక్టర్ తో చర్చించారు. ఎమ్మెల్యే చొరవ పట్ల బెటాలియన్ అధికారులు, సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు. మల్ రెడ్డిని కలిసిన వారిలో రిజర్వ్ ఇన్ స్పెక్టర్లు రవీందర్, యుగేందర్, శేఖర్, యూనిట్ వైద్యాధికారి రవి, ఇతర సిబ్బంది ఉన్నారు.



# త్వరలో రైల్వే అండర్ పాస్ రహదారికి మోక్షం

మధిర రూరల్ జూలై 28 ప్రభాత సూర్యుడుమున్సిపాలిటీ పరిధిలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆదేశాలకు కదిలిన అధికారులు పట్టణం రైల్వే అండర్ పాస్ రహదారి నిర్మాణ ప్రదేశంపై రెండు మ్యాపులతో స్థల పరిశీలనకు వచ్చిన అధికారులుఆర్ అండ్ బి డి ఈ శంకరరావు ఏ ఈ రాంబాబు అధికారులతో కలిసిమున్సిపల్ చైర్ పర్సన్ సామినేని సుజాత, వైస్ చైర్మన్ కోనాధనీకుమార్ కౌన్సిలర్లు, బోడెపుడి రేవతి వెంకట్రావు, నకిరికంటి రాజేశ్వర్ డెవలప్మెంట్ కమిటీ సభ్యులు డాక్టర్ వాసిరెడ్డి రామనాథం వేమిరెడ్డి శ్రీనివాసరెడ్డి రంగా శ్రీను బెజవాడ రవిబాబు మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు పారుపల్లి విజయకుమార్ మిర్యాల రమణ గుప్తా పట్టణ కమిటీ అధ్యక్షుడు తలుపుల వెంకటేశ్వర్లు పలువురు నాయకులు క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. నివేదిక మేరకు జిల్లా కలెక్టర్ సూచనలతో పనుల ప్రతిపాదన కార్యరూపం దాల్చే అవకాశం ఉందితెలిసిన సమాచారం మేరకు పట్టణ వర్తక వ్యాపార వర్గాలకు గృహ నిర్మాణాలకు ఎటువంటి నష్టం వాటిల్లకుండా రైల్వే అండర్పాస్ నిర్మాణం చేపట్టడం కు మున్సిపాలిటీ పాలకవర్గం డెవలప్మెంట్ కమిటీ సానుకూలత వ్యక్తం చేసింది

# మొక్కలు నాటండి . పర్యావరణాన్ని కాపాడండి..

**డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జాన్ మిల్టన్..**



భద్రాచలం జూలై 28 ప్రభాత సూర్యుడు: పర్యావరణాన్ని మనకు ప్రాణవాయువును అందించే మొక్కలను నాటి వాటి సంరక్షణ బాధ్యత తీసుకుంటే మనకు ఎటువంటి రోగాలు రుగ్మతలు దరిచేరవని భద్రాచలం డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జాన్ మిల్టన్ అన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల భద్రాచలం నందు "ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవం" పురస్కరించుకొని చీూా , జుఀశీ ఎశ్రీబఎ మరియు యాంటీ డ్రగ్ కమిటీ ఆధ్వర్యంలో కళాశాల ఆవరణలో సిబ్బంది విద్యార్థినీ విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారుఈ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ చెట్లు ప్రగతికు మెట్లు అనే నినాదాన్ని దృష్టిలో పెట్టుకొని మనకు ప్రాణవాయువు అందించడమే కాకుండా చల్లటి నీడను ఇచ్చి కాసేపు సెద తీరడానికి చెట్లు ఎంతో ఉపకరిస్తాయని అందుకు ప్రతి ఒక్కరూ ముఖ్యమైన సందర్భాలలో కాకుండా మన ఇంటిలో జరిగే పుట్టినరోజు పెళ్లిరోజు వేడుకలలో తప్పనిసరిగా ప్రజలకు పనికివచ్చే మొక్కను నాటి వాటి సంరక్షణ బాధ్యతను తీసుకోవాలని అన్నారు. అనంతరం మై భారత్ పోర్టల్ జిల్లా కన్వీనర్ రాంబాబు విద్యార్థులకు పర్యావరణ 10 రక్షణ మాదక ద్రవ్యాలను తీసుకోవడం వల్ల కలిగే అనర్థాలను అలాగే మొక్కలు నాటడం వలన పర్యావరణంలో కలిగే ప్రయోజనాల గురించి విద్యార్థిని విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ హవీలా,ఎన్ఎస్ఎస్ పిఓ లు అయిన డాక్టర్ కిరణ్ కుమార్, బి .సుధాకర్ రావు, అధ్యాపక బృందం మరియు విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# లింగాపురంపాడు గ్రామం లో ఘనంగా ముత్యాలమ్మ తల్లి సంబరాలు.



చర్ల జులై 28 ప్రభాత సూర్యుడు చర్ల మండలం లింగాపురంపాడు గ్రామంలో గ్రామ దేవత శ్రీ ముత్యాలమ్మ తల్లి వార్షిక సంబరాలలో భాగంగా ఈరోజు ఆఖరి రోజు సందర్భంగా ఘనంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. మూడు రోజుల పాటు ఈ ఉత్సవాల్లో ప్రత్యేక పూజలు, నిర్వహించరు మంచినీళ్ళ బిందెలతో భారీ సంఖ్యలో మహిళలు తరలివచ్చి అమ్మవారికి జలాభిషేకం చేశారు. గ్రామ ప్రజలంతా భక్తి శ్రద్ధలతో పూజలలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు అందుకున్నారు అనంతరం గ్రామస్తుల సహకారంతో అన్న సంతర్పణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం లో ఆలయ కమిటీ సభ్యులు అల్లం దాసు సాదం లోకనాథం అడబాల సత్యనారాయణ ముత్యాల రాణి మేడిచర్ల సత్యనారాయణ వేములపల్లి ప్రవీణ్ పున్నం వెంకటరమణ పంజా రాజు సాదం యుగంధర్ సాయి కాకర్ల సత్యేంద్ర కుమార్ ముత్యాల చరణ్ తేజ కాకర్ల సంతోష్ కుమార్ ముత్యాల సంపత్ కుమార్ సాదం శ్రీనివాస్ శీలం శ్రీనివాస్ కుక్కల చంటిబాబు కర్ల లక్ష్మణరావు పూజారి కృష్ణ మరియు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

# భానురు పోలీస్ స్టేషన్ పరిధిలో గుర్తు తెలియని మృతదేహం లభ్యం

జులై 28 ప్రభాత సూర్యుడు:పటాన్ చెరువు, బీడీఎల్ భానూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నందిగామ గ్రామ శివారులో పెన్నో ప్లాస్ట్ పరిశ్రమ పక్కన ఉన్న ఖాళీ స్థలంలో సుమారు 35--40 సంవత్సరాల వయస్సు గల గుర్తుతెలియని పురుషుని మృతదేహం లభ్యమైందని.మృతుడు హాఫ్ స్లీవ్ షర్ట్ మరియు డెనిమ్ జాగర్ జీన్స్ ప్యాంట్ ధరించి ఉన్నాడు. అతని కాలికి నల్ల దారంతో కట్టిన రాగి ఉంగరం మరియు నడుముకు రెండు వరుసల నల్ల దారం కట్టబడి ఉన్నాయి. పై వ్యక్తిని ఎవరైనా గుర్తించినా లేదా అతని గురించి ఏదైనా సమాచారం తెలిసినా, దయచేసి వెంటనే బీడీఎల్ భానూర్ పోలీస్ స్టేషన్ను సంప్రదించగలరని, సంఘటన స్థలానికి వెళ్లి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు



# ఇసుకవాగును పరిశీలించిన ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకటరావు



భద్రాచలం జూలై 28 ప్రభాత సూర్యుడువాజేడు మండలంలోని ఇసుకవాగును స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకటరావు పరిశీలించారు. ఈ సందర్భంగా సర్పంచులు, ఉపసర్పంచులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు. పరిశీలన అనంతరం ఇంజినీరింగ్ అధికారులతో ఎమ్మెల్యే మాట్లాడి, ఇసుకవాగుకు సంబంధించిన పరిస్థితులు, అవసరమైన చర్యలపై చర్చించి, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.



# విద్యార్థులకు మాధవ ద్రవ్యాల మీద అవగాహన

**ఇన్స్పెక్టర్ వెంకటప్పయ్య ఆదేశాల మేరకు.**

దుమ్ముగూడెం జులై 28ప్రభాత సూర్యుడు..దుమ్ముగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో స్థానిక పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ వెంకటప్పయ్య ఆదేశానుసారం ఏఎస్ఐ చంద్రశేఖర్ విద్యార్థులకు మాదకద్రవ్యాల వలన కలిగే అనర్థాల గురించి తెలియజేశారు అదేవిధంగా మాదకద్రవ్యాలు సేవించి బైక్ నడిపితే వాళ్ల తల్లిదండ్రుల మీద కేసు అవుతుందని జరిమానా మరియు జైలు శిక్ష పడుతుంది అని తెలియజేశారు విద్యార్థులకు ట్రాఫిక్ రూల్స్ గురించి లైసెన్స్ లేకుండా బైక్ నడపవద్దని తెలియజేశారు. విద్యార్థులు క్రమశిక్షణతో మెలిగి చదువుకోవాలని ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. పోలీస్ అక్క ప్రోగ్రాం గురించి మహిళ పోలీస్ కానిస్టేబుల్ శ్రీలక్ష్మి బాలికలకు ఏమైనా ఇబ్బంది ఏర్పడితే వెంటనే ధైర్యంగా సమాచారం ఇవ్వాలని బాలికలు సమయానుకూలంగా మెలగాలని ఎవరైనా మార్గమధ్యంలో ర్యాగింగ్ కామెంట్స్ చేస్తే వెంటనే సమాచారం ఇవ్వాల్సిందిగా బాలికలకు తెలియజేసినారు బాలికలు కూడా ఎందులోనూ తక్కువ కాదని మంచిగా చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ మేడం శ్రీమతి సిహెచ్ కృష్ణవేణి కళాశాల డ్రగ్స్ కౌన్సిలర్ శ్రీ కెపిడి వరరాజు గారు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ మల్లెల శ్రీనివాసరావు అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.





# విద్యార్థినులకు మెరిట్ అవార్డులు అందజేసిన అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

**టీఎంఆర్ఈఐఎస్ బాలికల పాఠశాలల్లో ఆకస్మిక తనిఖీ.. మౌలిక సదుపాయాలు, భోజన నాణ్యతపై సమీక్ష**

ఉప్పల్ జూలై 28 ప్రభాత సూర్యుడు :మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, ఐఏఎస్ మంగళవారం టీఎంఆర్ఈఐఎస్ బాలికల పాఠశాలలు--ఉప్పల్, మల్కాజిగిరి విద్యాసంస్థలను ఆకస్మికంగా సందర్శించి విద్యా, వసతి, మౌలిక సదుపాయాలపై సమగ్రంగా పరిశీలించారు. ఈ పర్యటనలో జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి జి. కాంతమ్మ పాల్గొన్నారు. పాఠశాలల్లోని తరగతి గదులు, వసతి గృహాలు, భోజనశాల, వంటశాల, మరుగుదొడ్లు, తాగునీటి వసతి, పరిశుభ్రతతో పాటు విద్యార్థినులకు అందిస్తున్న ఇతర సౌకర్యాలను అదనపు కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. పాఠశాల ప్రాంగణాన్ని పరిశుభ్రంగా నిర్వహిస్తూ విద్యార్థులకు మెరుగైన వాతావరణాన్ని కల్పిస్తున్నందుకు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిబ్బందిని అభినందించారు. అనంతరం విద్యార్థినులతో నిర్వహించిన ముఖాముఖి సమావేశంలో వారి విద్యాభ్యాసం, భవిష్యత్ లక్ష్యాలు, ఉన్నత విద్యపై అభిప్రాయాలను తెలుసుకున్నారు. క్రమశిక్షణ, సమయపాలన, నిరంతర శ్రమ విజయానికి బాటలు వేస్తాయని పేర్కొంటూ ఉన్నత ఆశయాలతో ముందుకు సాగాలని సూచించారు. ఈ సందర్భంగా పదో తరగతి, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో అత్యధిక మార్కులు సాధించిన ప్రతిభావంతులైన విద్యార్థినులకు మెరిట్ అవార్డులు ప్రదానం చేసి అభినందించారు. అలాగే 5వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న యూనిఫారాలు, పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, స్కూల్ కిట్‌లు తదితర విద్యా సామగ్రిని పంపిణీ చేశారు. తదనంతరం విద్యార్థినులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసిన అదనపు కలెక్టర్, ఆహార నాణ్యత, మెనూ, వంటశాల పరిశుభ్రతపై విద్యార్థుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన, పోషకాహారం అందేలా నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా శారీరక దృఢత్వం, మానసిక వికాసం, నాయకత్వ లక్షణాలు, ఆత్మవిశ్వాసం పెంపొందుతాయని తెలిపారు. ప్రతి విద్యార్థి సమగ్ర వ్యక్తిత్వ వికాసాన్ని లక్ష్యంగా పెట్టుకుని అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి జి. కాంతమ్మ, పాఠశాలల ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.



# సింగూర్ లో 4,322 టి.ఎం.సి.ల నీటి నిలువ

జులై 28 ప్రభాత సూర్యుడు సింగూర్ జలాశయంలో నీటి నిల్వలు క్రమంగా పెరుగుతున్నాయి. మంగళవారం నాడు ఉదయం 6:30 గంటల నాటికి జలాశయం నీటిమట్టం 515.280 మీటర్లకు చేరింది. మొత్తము 29.917 టీఎంసీల సామర్థ్యం గల జలాశయంలో ప్రస్తుతం 4.322 టీఎంసీల నీరు నిలువ ఉంది.గత 24 గంటల్లో సగటున 637 క్యూసెక్కుల ఇన్ ఫ్లో నమోదు కాగా 470 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇన్,ఫ్లో అవుట్ ఫ్లో కంటే అధికంగా ఉండడంతో జలాశంలో నీటి నిలువలు పెరుగుతున్నట్టు అధికారులు తెలిపారు.




# మండల స్థాయి సమీక్షా సమావేశం

**పాల్గొన్న ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్**




ములుగు జూలై 28, ప్రభాత సూర్యుడు:ములుగు జిల్లా వెంకటాపురం మండల కేంద్రంలో మండల స్థాయి సమీక్షా సమావేశంఏర్పాటు చేశారు. ఈ సమావేశం లో భద్రాచలం శాసన సభ్యులు తెల్లం వెంకట్రావ్ పాల్గొని వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో సమావేశమై మండలంలో అభివృద్ధి పనులు, ప్రజా సమస్య లు, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల అమలుపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్ మాట్లాడుతూ వర్షకాలం సమిపిస్తున్న నేపథ్యంలో అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని చూచనలు చేశారు. ప్రత్యేకంగా ఆరోగ్య శాఖ అధికారులు సీజనల్ వ్యాధుల నివారణకు ముందస్తు చర్యలు చేపట్టి ప్రజలకు మెరగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. ప్రజలకు అవసరమైన సేవలను ప్రతి శాఖ ఎలాంటి ఇబ్బందులు లేకుండా అందించేందుకు ప్రతి శాఖ బాధ్యతయుతంగా ఉండాలని అన్నారు. ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి లబ్ధిదారునికి చేరేలా అధికారులు కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ శాఖల అధికారులు, ప్రజా ప్రతి నిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



# జాడి యుగేందర్ మరణం కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు - మంత్రి సీతక్క

**పార్టీ కోసం జాడి యుగేందర్ చేసిన సేవలు చిరస్మరణీయం**



ములుగు జూలై 28, ప్రభాత సూర్యుడుములుగు జిల్లా గోవిందరావుపేట మండలం పస్రా గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జాడి యుగేందర్ అనారోగ్యంతో కన్నుమూయడం తీవ్ర విషాదకరం. వారి చిత్రపటానికి తెలంగాణ రాష్ట్ర పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా మరియు శిశు సంక్షేమ శాఖా మాత్యులు శ్రీమతి గౌరవ దనసరి అనసూయ సీతక్క పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ, జాడి యుగేందర్ గారు కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం ఎన్నో సంవత్సరాలుగా అంకితభావంతో పనిచేసిన నిబద్ధత కలిగిన నాయకుడని కొనియాడారు. పార్టీ సిద్ధాంతాల పట్ల వారి విశ్వాసం, ప్రజల పట్ల వారి సేవాభావం ఎప్పటికీ మరువలేనివని పేర్కొన్నారు. యుగేందర్ గారి మరణం కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని, వారి సేవలు పార్టీ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని అన్నారు. అలాగే ఈ క్లిష్ట సమయంలో వారి కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. జాడి యుగేందర్ గారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు పైడాకుల అశోక్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, ములుగు వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ రేగ కళ్యాణి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పాలడుగు వెంకటకృష్ణ గారితో పాటుగా జిల్లాలోని, మండలంలోని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర, జిల్లా, మండల, గ్రామ నాయకులు, ప్రజా ప్రతినిధులు, యూత్ నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు అందరూ పాల్గొన్నారు.

# పీ.హెచ్.సీని తనిఖీ చేసిన డి.ఎం.హెచ్.వో

జులై 28 ప్రభాత సూర్యుడుసంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ లలితాదేవి గుమ్మడిదల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం నాడు ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగులకు అందుతున్న వైద్య సేవలు ఓపి, ల్యాబ్ పరీక్షలు మతా-శిశు సంక్షేమ కార్యక్రమాలు, జాతీయ ఆరోగ్య పథకాల అమలును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. సంగారెడ్డి జిల్లాను ఆరోగ్య సేవలో తెలంగాణ రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలిపేందుకు సిబ్బంది కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో గుమ్మడిదల మండల వైద్యాధికారి డాక్టర్ మధుకర్ వైద్య సిబ్బంది తదిరులు పాల్గొన్నారు.



# సమంత ముఖంలో ఆ స్పెషల్ గ్లోకి కారణం ఇదేనా?




తాజాగా బయటకు వచ్చిన ఈ ఫోటోలు చూస్తే, ఆమె ఫేస్ లో కనిపిస్తున్న ప్రత్యేకమైన ఆనందం, సహజమైన గ్లో అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత ప్రస్తుతం జీవితంలో ఎంతో ఆనందమైన దశను ఆస్వాదిస్తోంది. తాను తల్లి కాబోతున్నానని అఫీషియల్ గా అనౌన్స్ చేసిన తర్వాత ఫ్యాన్స్ నుంచి ఆమెకు శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. తాజాగా బయటకు వచ్చిన ఈ ఫోటోలు చూస్తే, ఆమె ఫేస్ లో కనిపిస్తున్న ప్రత్యేకమైన ఆనందం, సహజమైన గ్లో అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. తాజాగా సమంత తన భర్త రాజ్ తో కలిసి కనిపించారు. ఈ ఫోటోల్లో బ్లాక్ కలర్ ఎలిగెంట్ అవుట్‌ఫిట్‌లో సమంత ఎంతో అందంగా కనిపించింది. ప్రెగ్నెన్సీ టైమ్ లో మహిళల ముఖంలో కనిపించే ప్రత్యేకమైన మెరుపు ఈ ఫోటోల్లో స్పష్టంగా కనిపిస్తోంది. చిరునవ్వుతో అభిమానులకు అభివాదం చేస్తూ కనిపించిన సమంత ఎంతో ప్రశాంతంగా, ఆత్మవిశ్వాసంతో కనిపించింది. రీసెంట్ గా మా ఇంటి బంగారం సినిమాతో సూపర్ హిట్ ను అందుకున్న సమంత, ప్రస్తుతం సినిమాలకు చిన్న విరామం ఇచ్చిన విషయం తెలిసిందే. డెలివరీ తర్వాత మళ్లీ ఆమె నటిగా బిజీ కానుంది. అయితే ఈ గ్యాప్ లో కథలను విని మంచి కథలేమైనా ఉంటే తన బ్యానర్‌లో నిర్మించే ఆలోచనలో కూడా ఉన్నట్లు సమాచారం. ఇక ఈ తాజా ఫోటోలు చూస్తే... మామ్ టు బీ గ్లో అంటే ఇదేనేమో అనిపించేలా సమంత మరింత అందంగా మెరిసిపోతోంది. ఆమె కొత్త ప్రయాణం కూడా ఇలాగే ఆనందంగా, ఆరోగ్యంగా సాగాలని అభిమానులు కోరుకుంటున్నారు.

# లోకేష్ డిఫరెంట్ గేమ్ ప్లాన్.. వర్కౌట్ అవుతుందా?

మరోవైపు ఈ కథకు లోకేష్ సినిమాటిక్ యూనివర్స్ రాజఖకి ఏమైనా కనెక్షన్ ఉందా అనే ఆసక్తికరమైన టాక్ కూడా నడుస్తోంది. ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, పాన్ ఇండియా సెన్సేషన్ లోకేష్ కనగరాజ్ కాంబినేషన్ లో ాూూ23 అనౌన్స్ అయినప్పటి నుంచే ఫ్యాన్స్ సర్కిల్స్ లో ఒక క్యూరియాసిటీ క్రియేట్ అయ్యింది. అయితే ప్రస్తుతం ఈ ప్రాజెక్ట్ స్క్రిప్టింగ్ అండ్ నేరేటివ్ ఫార్మాట్ కు సంబంధించి నెట్టింట రకరకాల గాసిప్స్ వినిపిస్తున్నాయి. కథ డిమాండ్ మేరకు అనవసరమైన కమర్షియల్ హంగులకు



చోటు ఇవ్వకుండా, పక్కా డార్క్ అండ్ రా యాక్షన్ ఓరియెంటెడ్ గానే ఈ కథను లోకేష్ ప్లాన్ చేస్తున్నట్లు ఇండస్ట్రీ వర్గాల అంచనా. అసలైతే ఒక బిగ్ స్టార్ ప్రాజెక్ట్ అనగానే డ్యూయెట్స్, సపరేట్ లవ్ ట్రాక్స్ ఉండాలనే ఆనవాయితీ మన దగ్గర ఉంది. కానీ లోకేష్ మాత్రం తన ఓరిజినల్ విజన్ ను ప్రెజెంట్ చేయడంలో కథకే తొలి ప్రాధాన్యత ఇస్తుంటారు. గతంలో 'ఖైదీ', 'విక్రమ్' లాంటి సినిమాల్లో కమర్షియల్ ఫార్ములాను పక్కన పెట్టి కథాబలంతోనే ఆయన బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్లు సాధించారు. ఇప్పుడు అల్లు అర్జున్ తో చేయబోయే ప్రాజెక్ట్ లో కూడా అదే స్టైల్ ను కొనసాగిస్తూ, ప్రతీ పాత్ర కథను ముందుకు నడిపించేలాగే డిజైన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. మరోవైపు ఈ కథకు లోకేష్ సినిమాటిక్ యూనివర్స్ రాజఖకి ఏమైనా కనెక్షన్ ఉందా అనే ఆసక్తికరమైన టాక్ కూడా నడుస్తోంది. లోకేష్ స్టైల్ ప్రకారం సినిమా అంతా ఒక నిర్దిష్టమైన రస్టిక్ అండ్ డార్క్ అట్మాస్ఫియర్ లో సాగే అవకాశం ఉంది. రొమాంటిక్ సీన్స్ కంటే కథలోని మెయిన్ కన్ఫ్లిక్ట్, పవర్ ఫుల్ విలనిజం, యాక్షన్ డ్రామా మీదే ఎక్కువ ఫోకస్ పెట్టబోతున్నట్లు సమాచారం. కథపై ఉన్న ఈ నమ్మకమే దర్శకుడికి ఇంత కాన్ఫిడెన్స్ ఇస్తోందని అనుకోవచ్చు. స్టార్ హీరో బ్రాండ్ ఇమేజ్ కి లొంగకుండా, స్క్రిప్ట్ లో ఏది అవసరమో దానికి మాత్రమే ప్రాధాన్యత ఇవ్వడం పాజిటివ్ సైన్ అని చెప్పాలి. పక్కా కంటెంట్ ఉన్నప్పుడు అల్లు అర్జున్ లాంటి యాక్టర్స్ కూడా కమర్షియల్ ఎలిమెంట్స్ కంటే ప్యూర్ ప్లాట్ కే ప్రాధాన్యత ఇస్తారు.

కథానాయకుడి రోల్ ని డిజైన్ చేసేటప్పుడు రెగ్యులర్ ఫార్మాట్ ను దాటి ఆలోచించడం ఈ ప్రాజెక్ట్ పై ఎక్స్‌పెక్టేషన్స్ పెరగడానికి ప్రధాన కారణం. అయితే ఆడియన్స్ కోసం బన్నీ మార్క్ ఎలివేషన్స్ ఏమైనా ఉంటాయా అనేది వేచి చూడాల్సిందే. బన్నీకి ఉన్న మాస్ ఇమేజ్, డాన్స్ స్కిల్స్ ను దృష్టిలో ఉంచుకుని ఒక పవర్ ఫుల్ సోలో సాంగ్ లేదా మాస్ ఎలివేషన్ సీక్వెన్స్ ప్లాన్ చేసే స్కోప్ అయితే ఉంది. డ్యాన్స్ లేకపోయినా బన్నీ స్క్రీన్ ప్రజెన్స్ ని లోకేష్ ఏ స్థాయిలో ఎలివేట్ చేస్తారనేది ఆసక్తికరంగా మారింది. కథలో స్పీడ్ తగ్గకుండా ఉండేలా మేకర్స్ ఈ స్క్రిప్ట్ పై చాలా వర్క్ చేస్తున్నట్లు వినబడుతోంది. ప్రస్తుతం అట్లీ ప్రాజెక్ట్ లో బిజీగా ఉన్న అల్లు అర్జున్, ఆ తర్వాత లోకేష్ కాంబోను సెట్స్ పైకి తీసుకెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. కథను నమ్ముకుని లోకేష్ కనగరాజ్ చేస్తున్న ఈ ప్రయోగంపై సరైన క్లారిటీ ఎప్పుడు వస్తుందో చూడాలి.

# ఆ విషయంలో మహేష్ బాబు కంటే డబుల్.. ఘట్టమనేని వారసుడిపై డైరెక్టర్ బిగ్ కామెంట్స్!

రమేష్ బాబు తనయుడు జయకృష్ణ ఘట్టమనేని హీరోగా ఎంట్రీ ఇస్తున్న చిత్రం 'శ్రీనివాస మంగాపురం'. ఘట్టమనేని కాంపౌండ్ నుంచి మరో కొత్త వారసుడు వెండితెరకు పరిచయం కాబోతున్నాడు. సూపర్ స్టార్ కృష్ణ గారి మనవడు, రమేష్ బాబు తనయుడు జయకృష్ణ ఘట్టమనేని హీరోగా ఎంట్రీ ఇస్తున్న చిత్రం 'శ్రీనివాస మంగాపురం'. ఈ సినిమా విడుదలకు సిద్ధమవుతున్న నేపథ్యంలో నిర్వహించిన ప్రెస్ మీట్‌లో దర్శకుడు అజయ్ భూపతి జయకృష్ణ గురించి చేసిన కామెంట్స్ ఇప్పుడు నెట్టింట బాగా వైరల్ అవుతున్నాయి. మహేష్ బాబు గారి కంటే డబుల్ కామెడీ, సెటైర్లు వేస్తాడని చెప్పడంతో ఈ సినిమాపై అంచనాలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. ఘట్టమనేని వారసుడి కొత్త ప్రయాణం: సూపర్ స్టార్ కుటుంబం నుంచి వస్తున్న జయకృష్ణకు నటనపై ఉన్న శ్రద్ధ, ఆసక్తి ప్రెస్ మీట్‌లో స్పష్టంగా కనిపించాయి. ఇండస్ట్రీలో కేవలం వారసుడిగానే కాకుండా, నటుడిగా తనను తాను నిరూపించుకుని సుస్థిర స్థానాన్ని సంపాదించుకోవడమే తన అసలు లక్ష్యమని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. తాతగారి, బాబాయ్ మహేష్ బాబు గారి పేరు నిలబెట్టేలా కష్టపడతానని చెప్పారు. మహేష్ బాబు కంటే డబుల్ సెటైర్లు: ప్రెస్ మీట్‌లో దర్శకుడు అజయ్ భూపతి మాట్లాడుతూ చాలా ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. ఇక మహేష్ బాబు గారితో పనిచేసినట్టే జయకృష్ణతో పనిచేస్తుంటే అనిపించిందని అన్నారు. "మహేష్ బాబు గారు షూటింగ్ సమయంలో సరదాగా సెటైర్లు వేస్తారని మనందరికీ తెలుసు. కానీ జయకృష్ణ మాత్రం బాబాయ్ కంటే డబుల్ సెటైర్లు వేస్తాడు. సెట్‌లో వాతావరణాన్ని చాలా సరదాగా ఉంచుతాడు'' అని చెప్పుకొచ్చారు. మహేష్ లాగే సుదీర్ఘ ప్రయాణం: సినిమా అనుకున్న దానికంటే చాలా అద్భుతంగా వచ్చిందని డైరెక్టర్ అజయ్ భూపతి ధీమా వ్యక్తం చేశారు. మహేష్ బాబు లాగే జయకృష్ణ కూడా టాలీవుడ్‌లో సుదీర్ఘ కాలం నిలిచిపోయే మంచి కథానాయకుడు అవుతాడని ప్రశంసించారు. ఇక ఆడియన్స్‌కు ఒక మంచి వినోదాత్మక చిత్రాన్ని అందిస్తున్నామని, సహకరిస్తున్న మీడియా మిత్రులందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. నటీనటులు.. విడుదల తేదీ: ఈ సినిమాలో జయకృష్ణకు జోడీగా రాషా తడానీ కథానాయికగా పరిచయం అవుతోంది. అలాగే కలెక్షన్ కింగ్ మోహన్ బాబు ఒక అత్యంత శక్తివంతమైన పాత్రలో కనిపించి మెప్పించబోతున్నారు. ఇక వైజయంతీ మూవీస్ సమర్పణలో పి. కిరణ్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. భారీ అంచనాలు ఉన్న ఈ చిత్రం జులై 30న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా థియేటర్లలోకి రానుంది. ఘట్టమనేని అభిమానులకు ఈ సినిమా ఒక పండుగలా మారబోతోంది. బాబాయ్ మహేష్ బాబు బాటలోనే తనదైన టైమింగ్‌తో అలరించడానికి వస్తున్న జయకృష్ణ ఘట్టమనేని, 'శ్రీనివాస మంగాపురం' చిత్రంతో వెండితెరపై ఎలాంటి మ్యాజిక్ చేస్తాడో చూడాలి. ఈ కొత్త కుర్రాడి సినీ ప్రయాణం విజయవంతంగా సాగాలని ఆశిద్దాం.



# 'ఆదర్శ కుటుంబం' నుంచి అసలు ఫన్ మొదలు.. వెంకీ, త్రివిక్రమ్ ల మ్యాజిక్!




ప్రస్తుతం మన టాలీవుడ్ నుంచి రానున్న పలు ఇంట్రెస్టింగ్ క్రేజీ కాంబినేషన్ లలో విక్టరీ వెంకటేష్ హీరోగా మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కలయికలో చేస్తున్న ఫ్యామిలీ ఎంటర్టైనర్ చిత్రం 'ఆదర్శ కుటుంబం' కూడా ఒకటి. ఈ పాటికే విడుదల కావాల్సిన ఈ సినిమా నుంచి వరుస అప్డేట్స్ ఇపుడు అందిస్తున్నారు. ఇలా లేటెస్ట్ గా హీరోయిన్ శ్రీనిధి శెట్టిపై వదిలిన టీజర్ గ్లింప్స్ మంచి ఎంటర్టైన్మెంట్ ని ఆడియెన్స్ కి ప్రామిస్ చేస్తుంది.వెంకీ మామపై మంచి ఫన్, తన భార్య కోసం చెప్పిన డైలాగ్ లు ఇంకా నటి నివేతా పెత్తురాజ్ కూడా ఇందులో కనిపించింది. ఇలా మొత్తానికి మరో సాలిడ్ ఎంటర్టైనర్ ని వీరు తీసుకొస్తున్నారని చెప్పొచ్చు. ఇదే ఫార్మాట్ లో సినిమా గనుక కొనసాగితే మాత్రం మళ్ళీ వింటేజ్ మ్యాజిక్ వెంకీ, త్రివిక్రమ్ ల నుంచి జరిగే ఛాన్స్ ఉందని చెప్పొచ్చు. ఇక ఈ చిత్రానికి థమన్ సంగీతం అందిస్తున్నాడు. అలాగే హారికా హాసిని వారు నిర్మాణం వహిస్తున్న సంగతి తెలిసిందే.

# 'ది ప్యారడైజ్' కోసం 'దసరా' బ్యూటీనా?




నాచురల్ స్టార్ నాని హీరోగా ఇప్పుడు నటిస్తున్న భారీ చిత్రం 'ది ప్యారడైజ్' కోసం అందరికీ తెలిసిందే. తన బ్లాక్ బస్టర్ చిత్రం 'దసరా' దర్శకుడు శ్రీకాంత్ ఓదెలతో చేస్తున్న ఈ రెండో సినిమా భారీ అంచనాలు సెట్ చేసుకుంది. అయితే ఈ సినిమా షూటింగ్ ఇప్పుడు దాదాపు పూర్తి కావస్తుండగా ఓ క్రేజీ బజ్ ఇపుడు దీనిపై వినిపిస్తుంది. ఆల్రెడీ ఈ సినిమాలో ఓ స్పెషల్ సాంగ్ ఉన్న సంగతి తెలిసిందే.అయితే కొన్నాళ్ల నుంచి ఆ సాంగ్ ఎవరు చేస్తారు అనేదే ప్రశ్నగా మిగిలింది. కానీ ఇప్పుడు ఫైనల్ గా తమ దసరా బ్యూటీనే లాక్ అయినట్టుగా వినిపిస్తుంది. స్టార్ బ్యూటీ కీర్తి సురేష్ దసరా సినిమాలో ఎలాంటి మ్యాజిక్ చేసిందో అందరికీ తెలిసిందే. ఇప్పుడు మళ్ళీ వారి కోసం కీర్తి ఓకే చెప్పినట్టుగా ప్రస్తుతం ఓ రూమర్ వైరల్ గా మారింది. మరి ఇది నిజమైతే మరోసారి వెన్నెల మ్యాజిక్ చేస్తుందో లేదో చూడాలి. ఇక ఈ చిత్రానికి అనిరుద్ సంగీతం అందిస్తుండగా ఎస్ ఎల్ వి సినిమాస్ వారు నిర్మాణం వహిస్తున్నారు.

# ఇకపై ఆ పేరుతో పిలవొద్దు.. అభిమానులకు అన్నా కొణిదెల స్పెషల్ రిక్వెస్ట్!

టాలీవుడ్ పవర్ స్టార్ పవన్ కళ్యాణ్, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ సతీమణి అన్నా కొణిదెల తాజాగా చేసిన సోషల్ మీడియా పోస్ట్ ఇంట్రెస్టింగ్ డిస్కషన్ కు దారితీసింది టాలీవుడ్ పవర్ స్టార్ పవన్ కళ్యాణ్, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ సతీమణి అన్నా కొణిదెల తాజాగా చేసిన సోషల్ మీడియా పోస్ట్ ఇంట్రెస్టింగ్ డిస్కషన్ కు దారితీసింది. ఇటీవలే ఇన్‌స్టాగ్రామ్‌లో అడుగుపెట్టి వరుసగా పర్సనల్ మెమొరీస్, ఫ్యామిలీకి సంబంధించిన ఫొటోలను షేర్ చేసుకుంటూ వస్తున్న ఆమె, ఈసారి తన పేరుకు సంబంధించిన అంశంపై స్పష్టమైన వివరణ ఇవ్వడం విశేషంగా మారింది. చాలాకాలంగా తనను అన్నాలెజినోవా అనే పిలుస్తున్నారని, కానీ పెళ్లి చేసుకున్న రోజు నుంచే తాను అన్నా కొణిదెల అనే పేరును తీసుకున్నానని, తన భర్త ఇంటి పేరుతోనే తనను పిలవాలని, మొదటి సారి తన పేరుపై రియాక్ట్ అవుతూ, ఇకపై తనను అన్నా కొణిదెల గానే సంబోధించాలని ఆమె కోరారు. తన పేరుకు సంబంధించిన ఈ విషయాన్ని వెల్లడించడానికి ఓ స్పెషల్ రీజన్ ఉందని కూడా అన్నా తెలిపారు. ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్ స్టార్ట్ చేసినప్పటి నుంచే ఈ విషయం చెప్పాలని అనుకున్నప్పటికీ, సరైన సిట్యుయేషన్ కోసం వెయిట్ చేశానని, తన బర్త్ డే దగ్గర పడుతున్నందున ఈ విషయాన్ని వెల్లడించడం సముచితంగా భావించినట్లు ఆమె చెప్పడం అభిమానుల దృష్టిని ఆకర్షించింది. పెళ్లి తర్వాత తన భర్త ఇంటిపేరును అధికారికంగా స్వీకరించిన విషయాన్ని గుర్తుచేసిన అన్నా, ప్రజల్లో మాత్రం ఇప్పటికీ పాత పేరే ఎక్కువగా వినిపిస్తోందని పేర్కొన్నారు. అందుకే ఇకపై తన ప్రస్తుత అధికారిక పేరునే ఉపయోగించాలని మీడియా, ఫ్యాన్స్, సోషల్ మీడియా వినియోగదారులకు ఆమె విజ్ఞప్తి చేశారు. ఒక వ్యక్తి పేరులోనే అతని లేదా ఆమె వ్యక్తిగత గుర్తింపు, ఆత్మీయత, అనుబంధం ప్రతిబింబిస్తాయని ఆమె వ్యాఖ్యానించడం ఈ పోస్టుకు మరింత ప్రాధాన్యత తీసుకొచ్చింది. అన్నా కొణిదెల నా పేరు.. అదే నేను అనే భావాన్ని వ్యక్తపరిచేలా చేసిన ఆమె చేసిన పోస్ట్ సోషల్ మీడియాలో విస్తృతంగా వైరల్ అవుతోంది. పేరును కేవలం పిలుపుగా కాకుండా, వ్యక్తిత్వానికి ప్రతీకగా భావించిన అన్నా అభిప్రాయానికి పలువురు మద్దతు తెలుపుతున్నారు. ఆ పోస్ట్ కు పవన్ ఫ్యాన్స్ కూడా ఇకపై ఆమెను అన్నా కొణిదెల గానే సంబోధిస్తామని కామెంట్లు చేస్తూ, ఆమె డెసిషన్ ను, పేరు పట్ల తనకున్న క్లారిటీని స్వాగతిస్తున్నారు. ఈ పోస్టుతో పాటు పవన్ కళ్యాణ్‌తో కలిసి విదేశీ పర్యటన సందర్భంగా దిగిన ఓ అరుదైన ఫొటోను కూడా అన్నా పంచుకున్నారు. ఆ పర్సనల్ మెమొరీని ఫ్యాన్స్ తో షేర్ చేయడంతో పోస్టుకు మరింత ఆదరణ లభించింది. పోస్ట్ చేసిన కొద్ది గంటల్లోనే వేల సంఖ్యలో లైక్‌లు, కామెంట్లు రావడం ద్వారా ఈ పోస్ట్ సోషల్ మీడియాలో ట్రెండింగ్‌గా మారింది. వ్యక్తిగత గుర్తింపుకు సంబంధించిన చిన్న అంశాన్ని కూడా ఎంతో హుందాగా, ఎమోషన్ తో వెల్లడించిన అన్నా కొణిదెల పోస్ట్ ప్రస్తుతం అభిమానులతో పాటు సాధారణ నెటిజన్ల మధ్య కూడా చర్చనీయాంశంగా మారింది.



Published & Owned by CHERUKU UPENDAR on behalf of HAMSA PUBLICATIONS,Pulblished at H.No:7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR,ABDULLAPURMET MANDAL,Hayanthnagar,Rangareddy District/Hyderabad City,Telangana-Pin:501505. Printed by RATNA GRAPHICS at H.No.2-3-703/7,Tirumala Nagar Colony,Police Lane,Amberpet, Hyderabad-500 013 Telangana.Editor: CHERUKU UPENDAR E-mail:prabhathasuryudueditor@gmail.com PRGI Reg No:TGTEL/25/A0555